సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

చురుగ్గా బీఆర్‌టీఎస్ రోడ్డు పనులు



గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్డులో జరుగుతున్న పనులు

గోపాలపట్నం: గోపాలపట్నంలో బీఆర్‌టీఎస్ రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. బీఆర్‌టీఎస్‌తోపాటు సర్వీస్ రోడ్డు పనులకు జీవీఎంసీ నిధులు రూ.3.69 కోట్లతో ఇటీవల శంకుస్థాపన చేశారు. ముందుగా బీఆర్‌టీఎస్ రోడ్డు పనుల నిమిత్తం బాజీ జంక్షన్ నుంచి శ్మశానవాటిక కూడలి వరకు వాహనాలను అనుమతించకుండా బ్లాక్ చేశారు. రాత్రి సమయాల్లో కూడా ఈ పనులు జరుగుతుండటంతో మరింత వేగం పుంజుకున్నాయి. పనుల సమయంలో వాహన చోదకులు సహకరించాలని జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు కోరుతున్నారు.

జోరుగా కర్రపెండలం విక్రయాలు



ఎన్‌ఏడీ కూడలిలో కర్రపెండలం దుంపలు విక్రయిస్తున్న వృద్ధురాలు

విశాఖ విద్య: మార్కెట్‌లో కర్రపెండలం దుంపల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మెట్ట ప్రాంత భూముల్లో ఈ సీజన్‌లో పండే పంటను విక్రయించేందుకు రైతులు మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. ఎన్‌ఏడీ కూడలి, మద్దిపాలెం రైతుబజారులో నాణ్యమైన కర్రపెండలం దుంపలు లభ్యమవుతున్నాయి. రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలు ఎక్కువగా ఉండటంతో కర్రపెండలం కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. మద్దిపాలెం రైతుబజారులో కేజీ రూ.24 ధరకు విక్రయించేలా ఏర్పాట్లు చేశామని ఎస్టేట్ ఆఫీసర్ వరహాలు తెలిపారు.

వార్డు సమస్యలపై జీవీఎంసీ కమిషనర్‌కు వినతి



జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు సమస్యలపై కార్పొరేటర్ బొమ్మిడి రమణ గురువారం కమిషనర్ సాయికాంత్ వర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. వార్డులోని లక్ష్మీనగర్-ఎఫ్ బ్లాక్‌లో రక్షణ గోడలు, కాలువలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ నైట్ షెల్టర్ భవనంపై అదనపు అంతస్తు నిర్మాణం, బాజీ జంక్షన్ పార్కులో ఓపెన్ జిమ్, బెంచీలు, సీతారామరాజు పార్కులో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని, కాలనీల్లో రహదారులు, డ్రైనేజీలు మెరుగుపరచాలని విన్నవించారు.

నైపుణ్యాభివృద్ధితో మెండుగా అవకాశాలు

అగనంపూడి: విద్యార్థులు జీవన నైపుణ్యాలు పెంచుకుంటే జీవితంలో మంచి గమ్యాన్ని చేరుకుంటారని కెరీర్ గైడెన్స్ మోటివేటర్ కౌశిక్ అగస్త్య అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో కెరీర్ గైడెన్స్‌పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే ఎటువంటి నైపుణ్యాలను అలవర్చుకోవాలి, పోటీ పరీక్షలు, పరీక్షల విధానంపై వివరించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ బీటెక్ పూర్తి చేసిన తరువాత ఉద్యోగాలు పొందాలనుకునే విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలపై అవగాహన, పరిజ్ఞానం ఉంటే సరిపోదని, పోటీ పరీక్షలకు తగిన తర్ఫీదు అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, సీఈవో ఎన్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
8978872250

పేదల ఆరోగ్యానికి భరోసా

- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన
- చెంతకే మెరుగైన వైద్య సేవలు
- ఏర్పాట్లు పర్యవేక్షించిన అడిషనల్ డీఎంహెచ్‌వో



వైద్య పరీక్షల అనంతరం కుర్చీల్లో సేద తీరుతున్న మహిళలు



బుచ్చిరాజుపాలెం శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు



వైద్య శిబిరంలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ పూర్ణేందర్

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం సెయింట్ ఆన్స్ పాఠశాలలో నాలుగో రోజు గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం కొనసాగింది. 91 వార్డు సుసర్ల కాలనీ-1 సచివాలయం పరిధిలోని ప్రజలకు వైద్య సేవలు అందించారు. వృద్ధులు, మహిళలు అధిక సంఖ్యలో వైద్య సేవలు పొందేందుకు తరలివచ్చారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో దంత, కంటి వ్యాధులకు పరీక్షలు చేయించుకునేందుకు విద్యార్థులు సైతం ఎక్కువగా శిబిరానికి వచ్చారు. సాధారణ వైద్య పరీక్షలతో పాటు గైనకాలజిస్ట్, నేత్ర, దంత వైద్య నిపుణుల వద్దకు ఎక్కువ మంది సేవలు పొందేందుకు క్యూ కట్టారు. వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

ఆడారి చొరవతో స్వచ్ఛంద సేవలు

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. అన్ని రోగాలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్పెషలిస్ట్ వైద్యులను అందుబాటులో ఉంచుతున్నారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ప్రైవేటు ఆస్పత్రులకు చెందిన వైద్య నిపుణులు సైతం స్వచ్ఛందంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో సేవలు అందించేందుకు తరలివస్తున్నారు.

కేంద్రాల్లో సకల సౌకర్యాలు

సెయింట్ ఆన్స్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సేవలు పొందేందుకు వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆడారి ఆనంద్‌కుమార్ కార్పొరేటర్లు, వార్డు కన్వీనర్లను అప్రమత్తం చేశారు. శిబిరానికి వచ్చే అందరికీ రుచికరమైన భోజనం అందిస్తున్నారు. వైద్యుల వద్ద ఎక్కువ సేపు వేచి ఉండాల్సిన పరిస్థితుల్లో కుర్చీలు ఏర్పాటు చేశారు. జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పూర్ణేందర్ ఇక్కడి వైద్య శిబిరాన్ని పరిశీలించి, అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. వైద్యులకు పలు సూచనలిచ్చారు. చెంతకే స్పెషలిస్టు వైద్యులు వస్తున్నందున ఎక్కువ మంది సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా ప్రచారం చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు.

వైద్య సేవల పరిశీలన

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. గురువారం ఆయన ఈ శిబిరాన్ని పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి రోగులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. లక్ష్మీనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు బి.పూజ పర్యవేక్షణలో 471 సచివాలయం పరిధిలోని ప్రజలు, చిన్నారులు వైద్య శిబిరంలో పాల్గొని వివిధ పరీక్షలు చేయించుకున్నారు. అంగన్‌వాడీ సిబ్బంది తయారు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. క్షయ వ్యాధి విభాగం సిబ్బంది ప్రత్యేక కౌంటర్ ద్వారా పేషెంట్లకు వైద్య సేవలందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, శానిటరీ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, డేనియల్, కడితి రాజు, రాజి, ఎం.శ్రీను, కె.భాగ్య, ఆర్పీ సుబ్బలక్ష్మి, వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొని వైద్య శిబిరానికి సహకరించారు.



వైద్య సేవలను పరిశీలిస్తున్న జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు

మహిళల ఆర్థికాభివృద్ధికి ఆర్పీల కృషి



మాట్లాడుతున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: పొదుపు సంఘాల మహిళల(డ్వాక్రా) ఆర్థికాభివృద్ధికి ఆర్పీలు కృషి చేయాలని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఏకేసీ కాలనీలో గురువారం ఆర్పీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళాభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. మునుపెన్నడూ లేని విధంగా అనేక సంక్షేమ పథకాల ద్వారా మహిళలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా సచివాలయ సిబ్బంది, ఆర్పీలు చూడాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

షిప్‌యార్డ్ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గ్రామ మండలి వద్ద గురువారం హిందుస్థాన్ షిప్‌యార్డ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం జరిగింది. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.సత్యానందరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో సభ్యులు, రిటైర్డ్ ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఇటీవల షిప్‌యార్డ్‌కు సుమారు రూ.17 వేల కోట్ల భారీ ఆర్డర్ వచ్చిందని, దీని కోసం శ్రమించిన సంస్థ సీఎండీ హేమంత్ ఖత్రీకి అంతా హర్షం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. షిప్‌యార్డ్ చరిత్రలో ఇది పెద్ద విజయంగా అభివర్ణించారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రిటైరైన ఉద్యోగులకు సెలవు వేతనాలలో ఈ ఏడాది అక్టోబర్‌లో చెల్లించినందుకు యాజమాన్యానికి వారు ధన్యవాదాలు తెలియజేశారు. 2022 ఏప్రిల్, 2023 డిసెంబర్ మధ్య కాలంలో రిటైరైన వారికి కూడా ఈ ఏడాదిలో సెలవు వేతనం చెల్లించాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ డిమాండ్‌కు సంబంధించి షిప్‌యార్డ్ యాజమాన్యానికి అసోసియేషన్ ప్రతినిధులు సమావేశం అనంతరం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జి.ఎస్.ఆనంద్‌కుమార్, బి.వి.ఎస్.పాత్రో, ఎస్.వి.రమణ, ఎస్.బాబూరావురెడ్డి, దాకరపు నూకరాజు, వి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కమిటీలో మంజుల, జ్యోతి



మంజుల, జ్యోతిలకు నియామక పత్రాలను అందజేస్తున్న మేడపాటి రవీంద్ర

విశాఖ విద్య: బీజేపీ జిల్లా కమిటీలో ఎన్‌ఏడీ ప్రాంతానికి చెందిన ఇరువురు మహిళలకు చోటు దక్కింది. పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా చల్లా మంజుల, కార్యదర్శిగా నాదెళ్ల జ్యోతి నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర గురువారం వారికి నియామక పత్రాలు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ బలోపేతానికి కమిటీలో నూతనంగా ఎంపికైన మహిళా నాయకులు కృషి చేయాలని మేడపాటి కోరారు. తమ నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, రాష్ట్ర నాయకులు కాశీ విశ్వనాథ రాజు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి దాడి పురుషోత్తం రమేష్‌లకు మంజుల, జ్యోతిలు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



ఏఈకి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

మల్కాపురం: విద్యుత్ చార్జీలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.సత్యాంజనేయ కోరారు. ఈ మేరకు గురువారం శ్రీహరిపురం సబ్‌స్టేషన్ ఏఈని కలిసి వినతిపత్రం అందజేశారు. పెరిగిన విద్యుత్ చార్జీలపై సీపీఐ నాయకులు సబ్‌స్టేషన్ వద్ద గురువారం ఉదయం నిరసన కార్యక్రమం చేపట్టారు. సత్యాంజనేయ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి విద్యుత్ చార్జీలను తగ్గించి, సామాన్యులకు మేలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుడాల రాంబాబు, నూనెల సూరిబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 25న విరాట్ హిందూ సమ్మేళన్ వేడుక



మాట్లాడుతున్న డి.ఎస్.వర్మ

సీతమ్మధార: హిందూ సమాజాన్ని కాపాడుకోవాలనే నినాదంతో విరాట్ హిందూ సంఘ్ ఏర్పాటు చేశామని వ్యవస్థాపక అధ్యక్షుడు డి.ఎస్.వర్మ తెలిపారు. గురుద్వారా దరి ఒక హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నవ నరసింహ క్షేత్రం సింహాచలం లాంటి పుణ్యప్రదేశం, దక్షిణ భారతదేశంలో లక్ష్మీదేవి, కనకమహాలక్ష్మిగా కొలువైన విశాఖ.. విభిన్న సంస్కృతులు, వివిధ రాష్ట్ర ప్రజలకు సుఖ సంతోషాలు ఇచ్చే ప్రదేశమన్నారు. విశ్వనగరంలో నవంబర్ 25న విరాట్ హిందూ సంఘ్ సమ్మేళన్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. హరి కేశవులకు ఇష్టమైన కార్తీక మాసంలో ఈ వేడుకను జరుపుతున్నామన్నారు. ఈ సమ్మేళన్‌లో హనుమాన్ శోభాయాత్ర, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖ ఆధ్యాత్మిక వేత్తలు, హిందూ ధార్మిక వేత్తలకు హిందూ ధార్మిక కార్యక్రమాలకు ప్రధాన సింహద్వారంగా ఉందన్నారు. కార్యక్రమంలో సభ్యులు కపిల్ అగర్వాల్, రాఘవేంద్ర మిశ్రా, కె.హెచ్.వి.శర్మ, దుర్గాప్రసాద్, ఫణీంద్ర పాల్గొన్నారు.

వెంకటాపురంలో పర్యటన



వెంకటాపురంలో ప్రతిపాదిత రోడ్డును పరిశీలిస్తున్న బెహరా భాస్కరరావు, డీఈ విజయ్‌కుమార్

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో గురువారం కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, డీఈ విజయ్‌కుమార్‌లు పర్యటించారు. ఈ ప్రాంతంలో ప్రతిపాదిత రహదారులు, కాలువలను పరిశీలించారు. వాటి కోసం సుమారు రూ.15 లక్షలు వెచ్చించనున్నారు. ఈ పనులకు త్వరలో శంకుస్థాపనలు చేయనున్నామని బెహరా భాస్కరరావు తెలిపారు. పర్యటనలో కంపర రామకృష్ణ, నీలాపు కిరణ్, సత్యనారాయణ, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణం కూల్చివేత

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఎన్‌ఏడీ కూడలి పరిధిలోని కాకాని నగర్‌లో అనధికార నిర్మాణాన్ని జోన్-8 అధికారులు కూల్చివేశారు. కాకాని నగర్‌లో జీ ప్లస్ 2 ఫ్లోర్‌కు అనుమతులు పొందిన నిర్మాణదారుడు, ఇందుకు విరుద్ధంగా మరో అంతస్తును కడుతున్నాడు. దీనిపై ఫిర్యాదులు రావడంతో జీవీఎంసీ అధికారులు ఇది వరకే నోటీసు ఇచ్చారు. అయినప్పటికీ యథావిధిగా నిర్మాణం కొనసాగుతుందనే ఫిర్యాదుల నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ అధికారి కె.జయరామ్ తమ సిబ్బందితో గురువారం కాకాని నగర్‌లో పర్యటించారు. అనుమతులకు విరుద్ధంగా మరో అంతస్తు నిర్మిస్తున్నట్లు ధ్రువీకరించి, దానిని కూల్చివేయాలని సిబ్బందికి సూచించారు. దీంతో అంతస్తును జీవీఎంసీ సిబ్బంది తొలగించే పనులు చేపట్టారు. అనుమతులకు మించి నిర్మాణం చేపట్టినట్లు తమ పరిశీలనలో తేలిందని, దానిని తొలగిస్తున్నట్లు ఏసీపీవో జయరామ్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



మణి మృతదేహం

మద్దిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. 104 ఏరియా ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో తన అన్నయ్యతో కలిసి నివసిస్తున్న మణి(21) బుధవారం అర్ధరాత్రి దాటాక చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు, అన్నయ్య కలిసి అదే ప్రాంతంలో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం మణి సోదరుడు టింకు ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

40వ వార్డు అభివృద్ధి పనులపై విజ్ఞప్తి



కమిషనర్ సాయికాంత్ వర్మకు వార్డు సమస్యలు విన్నవిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు అభివృద్ధి పనుల విషయమై కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు గురువారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. వార్డులో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, టెండర్లు ఖరారైన పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, ప్రణాళికలు రూపొందించిన పనులకు టెండర్లు వేయించాలని కార్పొరేటర్ కోరారు. ముఖ్యంగా ఏకేసీ కాలనీలోని వాంబే గృహాల మరమ్మతులు చేపట్టాలని, కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే ఆపివేశారని, వాటిని తక్షణం పునఃప్రారంభించేలా దృష్టి సారించాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ త్వరలోనే వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ నాగేశ్వరరావు తెలిపారు.

ప్రత్యేక పూజలు.. విశేష అలంకరణలు



బుచ్చిరాజుపాలెంలో మహాలక్ష్మి అలంకరణలో దుర్గాలమ్మ



యాదవ వీధిలో చండీదేవి అవతారంలో దుర్గాదేవి



ఏకేసీ కాలనీలో వేపకొమ్మల అలంకరణలో నూకాంబిక

విశాఖ విద్య: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం 90వ వార్డు ఎన్‌ఏడీ కూడలి బుచ్చిరాజుపాలెం దుర్గాలమ్మ-బంగారమ్మ వారి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో కలశ పూజ చేశారు. ఆలయ నిర్వాహక కమిటీ అధ్యక్షుడు బుజ్జి, కార్యదర్శి జగన్, కుమార్, గోపి, సతీష్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

మహాచండీగా దుర్గాదేవి

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం యాదవ వీధిలో డేరింగ్ అండ్ డాషింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం దుర్గమ్మ వారిని మహాచండీదేవిగా అలంకరించారు. అమ్మవారికి గులాబీలతో పూజలు చేసి, అరటిపండ్లు, పులగం నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం మండపం వద్ద స్థానిక మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

- ఇదే ప్రాంతంలో అల్లరి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే పి.గణబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. జనతా కాలనీ, గాజువాక ఆర్టీసీ డిపో, శ్రీహరిపురం దుర్గాదేవి మండపాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.



దుర్గాలమ్మ-బంగారమ్మ ఆలయంలో కలశ పూజ చేస్తున్న భక్తులు



62వ వార్డులో దుర్గాదేవిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ లక్ష్మణరావు



వెంకటాపురంలో అమ్మవారిని దర్శించుకుంటున్న బెహరా భాస్కరరావు

దుర్గాదేవిని దర్శించుకున్న బెహరా

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలోని దుర్గాదేవి మండపంలో అమ్మవారిని గురువారం జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. కంపర రామకృష్ణ, బలిజ అప్పలనాయుడు, అభిరామ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డులో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఎన్టీఆర్ కాలనీలో దుర్గమ్మవారికి ధూప, దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అమ్మవారిని దర్శించుకుని అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- 40వ వార్డు ఏకేసీ కాలనీలో నూకాంబిక అమ్మవారిని వేపకొమ్మలతో అలంకరించారు. కార్పొరేటర్, ఆలయ ధర్మకర్త గుండపు నాగేశ్వరరావు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక మహిళలు పాల్గొన్నారు.
- సింధియాలోని షిప్‌యార్డ్ కాలనీలో సింధియా డీపీ బాయ్స్ కమిటీ అధ్వర్యంలో గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు.



షిప్‌యార్డ్ కాలనీలో అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

'జిందాల్‌ను స్టీల్‌ప్లాంట్‌లోకి అనుమతించం'



సమావేశంలో ప్రసంగిస్తున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోకి జిందాల్‌ను అనుమతించే ప్రసక్తి లేదని స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకులు స్పష్టం చేశారు. బ్లాస్ట్‌ఫర్నేస్-3ను జిందాల్‌కు అప్పగించాలని యాజమాన్యం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో కార్మిక సంఘాలను, కార్మికులను చైతన్యపరిచేందుకు విభాగాల్లో ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఇంజినీరింగ్ షాప్స్‌కు చెందిన సెంట్రల్ మిషన్ షాప్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. ప్లాంట్ మొత్తం ప్రైవేటీకరణ ప్రక్రియపై ఆటంకాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ఇలా ఒక్కొక్క విభాగాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలన్న కుట్ర జరుగుతోందన్నారు. బీఎఫ్-3ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే విశాఖ ఉక్కు మనుగడకు ప్రమాదం అవుతుందన్నారు. యాజమాన్యం ఈ ప్రయత్నాన్ని నిలిపివేయపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జె.అయోధ్యరామ్, వై.టి.దాస్, వై.మస్తానప్ప, జె.రామకృష్ణ, జి.ప్రభాకర రెడ్డి, జి.గణపతిరెడ్డి, పరంధామయ్య, బి.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే 'ఉక్కు' పరిరక్షణ

- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 980వ రోజుకు రిలే దీక్షలు



980వ రోజు ఉక్కుదీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు కార్మికులు చేస్తున్న ఉద్యమం వారి పోరాట శక్తికి నిదర్శనమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 980వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఓబీసీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో ప్రజలందరినీ భాగస్వాములు చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందన్నారు. కర్మాగార పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com